నా లైదురోజులు తిండిలేక మలమల మాడేవానికి పరమాన్నము పెడితే ఎంతగా సంతోషిస్తాడో; ప్రియురాలి కోసము నిద్రాహారాలు మానుకొని చిర కాలము నిరీక్షిస్తున్న ప్రియునికి అకస్మాత్తుగా ప్రేయసి ఎదురయితే ఎంతగా ఆనందబాష్పాలు రాలుస్తాడో, అంత సంతోషము పొందాడు; వెంకట్రావు జీతము డబ్బులు చేతిలోపడేసరికి. పది హేనురోజులబట్టి చేతిలో డబ్బులేక వెంకట్రావు ఇంట్లో కొంచెం ఇరకాటంగా ఉంది. చివరి కెలా అయితేనేం ఒకటవతారీఖు నాటికి జీతం 72రూపాయిలుముట్టేనాయి. అందులో ఒక అరబస్తా బియ్యానికిచ్చి చిల్లరమల్లర దినుసులకయిన ఖర్చుపోను, చేతిలో ఒక 20 రూపాయిలు మాత్రం మిగిలాయి.

అవాళ వెంకట్రావు ప్రక్కవూరి రామయ్యపాలేనికి బయలుదేరాడు. తన మిత్రుడు మూర్తిని కలుసుకొని ముఖ్యవిషయాలు మాట్లాడాలి. మూర్తి, వెంకట్రావులు చిన్నప్పుడు హైస్కూలులో క్లాసు మేట్సు. ఇంటివద్ద ఉబుసుపోనప్పుడు వెంకట్రావు అలా మూర్తిగారింటికి వెళ్ళడం పరిపాటి. ఆవేళ వెళ్ళేటప్పుడు ఎందుకైనా మంచిదని నాలుగురూపాయిలు జేబులో వేసుకొని మరీబయలుదేరాడు. జీతం వచ్చిన మొదట నాల్గురోజులపాటు వెంకట్రావు కొంచెం హుషారుగా నేఉంటాడు.

ఊరుదాటి మలుపు తిరిగితే మిగిలిన రోడ్డంతా తిన్నంగా పోతుంది. మలుపు దగ్గిర నుంచుంటే రామయ్యపాలెం కనిపిస్తుంది. క్రోశమధ్యలో రావిచెట్టుక్రింద ఏదో గలాటా జరుగుతూండడం వెంకట్రావు కనిపెట్టేడు. గలాటాపడుతున్నవారు ఇద్దరుమాత్రమే. ఆడియున్నగా అక్కడే ఒక కుఱ్ఱాడుమాత్రం ఉన్నాడు. వెంకట్రావు ఆ చెట్టుదగ్గఱకి వచ్చేసరికి ఇద్దర్లో ఒకడు దిక్కుమొఖం వేసుకొని అలా రామయ్యపాలెంవైపు పోయాడు...

పైన ఎండ తీవ్రంగాఉంది. టైము మూడు దాటింది. వెంకట్రావుకు చెట్టుదగ్గఱకొచ్చేటప్పటికి దాహం వేసింది. చెట్టు ప్రక్కనున్న నూతి దగ్గఱకెళ్ళి ఒక చేదెడు నీళ్లు తీసి శుభ్రంగా ముఖం చేతులు కడుగుకొని, కాసినినీళ్లు త్రాగేడు. జేబురుమాలుతో ముఖం చేతులు తుడుచుకుంటూ రోడ్డు ఎక్కేటప్పటికి "ఇంత ఎండలో ఏం వెళ్తారు. కొంచెంసేపు కూర్చుని మరీ వెళ్ళండి." అన్నమాటలు విని వెనక్కు తిరిగాడు. అక్కడ ఒకాయన మందహాసము చేస్తూ "కూంతసేపు నీడలో కూర్చుని మరీ వెళ్లండి......మీది కిష్టాయిపురమే గదండీ! ఎక్కడో చూసిన జ్ఞాపకము." అని తన చేతిలో ఉన్న ముక్కలు అలా ఇలా తిరగేశాడు.

"మరేనండీ!...మీపేరు?" అన్నాడు వెంకట్రావు కొంచెం దీర్ఘంగా ఆలోచిస్తూ.

"నాపేరా? నన్ను మారన్న అంటారులెండి"

"ఏమండీ! ఎవరిక్కడ ఇందాక గలాటాపడుతున్నారు. చాల గందరగోళం జరిగినట్టుందే!" అని అడిగాడు వెంకట్రావు మారన్నప్రక్కన పచ్చగడ్డిలో కూర్చుంటూ.

"అవునండీ. ఆయన నాకు కొంచెం లెఖ్ఖ బాకీపడ్డాడు. ఇవ్వవలసింది పదిహేను రూపాయిలయితే పదరూపాయిలని దబాయిస్తున్నాడు. అంతేనండి."

మారన్న చేతిలోనున్న మూడు పేకముక్కలు అటూ ఇటూ తిరగేశాడు. మళ్లా ఇటూ అటూ కంగారుగా మార్చేసి ఒక చిన్నబల్లమీద పెట్టేడు. ప్రక్కనున్న కుఱ్ఱాడు ఒక అణాకాసు తీసి ఒక పేకముక్కమీద పెట్టేడు. పేకముక్క తిరగేశాడు మారన్న. జాకీబొమ్మ వచ్చింది. మిగతా రెండు ముక్కలు 6, 7 బంతులు. ఆ కుఱ్ఱాడు తన అణాయే కాకుండా మారన్నదగ్గఱ ఒక అణా తీసుకున్నాడు.



పేకముక్క తిరిగేశాడు మారన్న. జాకీబొమ్మ వచ్చింది.

# అదృష్టవంతుడు

శ్రీ యం. రామారావు

"అంటే బొమ్మమీద పెట్టే మీరు ఆ అబ్బాయికి ఇచ్చేయాలన్నమాట ఎంత పెడితే అంత" అని వెంకట్రావు అడిగాడు కొంచెం ఆటకు దగ్గరగా కూర్చుంటూ.

"మీరు ఏదో కొంత డబ్బు ఒక ముక్కమీద పెట్టేరనుకోండి. అది తిరగేస్తే బొమ్మయితే, ఎంత పెట్టేరో అంత నేను ఇవ్వాలి. లేకపోతే అది నాదే ఆట మొదట ముక్కలు చూపించే కలుపుతాను" అన్నాడు మారన్న.

మళ్లా వేశారు పందెము. మూడు ముక్కలు ఇలా పైకెత్తి చూపించి అటు ఇటు గమ్మత్తుగా మార్చి బల్లమీద పెట్టేడు. ఈసారి కుర్రాడు ఒక బేడకాసు తీసి దక్షిణవైపునున్న ముక్కమీద పెట్టేడు. ముక్క త్రిప్పిచూసేసరికి జాకీ బొమ్మ! మారన్నది మళ్ళా బేడ పోయింది. రెండు సార్లు పోయేటప్పటికి కొంచెం మారన్న విసుక్కోడం మొదలెట్టేడు. కుర్రాడు హుషారెక్కాడు.

ఈసారి కుర్రాడు మళ్ళీ బేడ పెట్టేడు. తీసి చూసేసరికి అది ఆరు బంతి! కుర్రాడికి బేడ పోగానే కొంచెం హుషారు తగ్గింది. ఈ దఫా కుర్రాడు పావలా తీసేడు. ముక్కలు చూపించి ఇటు అటు కలిపేశాడు మారన్న. పావలాతీసి కుర్రాడు మధ్యదానిమీద పెట్టేడు. తిరగేసి చూసేసరికి జాకీ! పావలా ఎగిరి వచ్చింది కుర్రాడికి.

వెంకట్రావుకి హుషారు జోరైంది. "నేనూ కాస్తానండీ" అని బోణీగా పావలా పెట్టాడు. కుర్రాడు కాయడం మానేసి ప్రక్కన కూర్చున్నాడు. ధర్మరాజు గారి పోజు ఇచ్చేసి మూడుముక్కలు చూపించి అటూ ఇటూ కలిపేశాడు మారన్న. వెంకట్రావు పావలా ఉత్తరం వైపు ముక్కమీద పెట్టేడు. వస్తుందో రాదో అని వెంకట్రావు కొంచెం గాభరా పడ్డాడు. అంత గాభరాపడ్డప్పటికీ తాను పెట్టిన ముక్కమూల చివర కొంచెం మడత పడినట్లు గ్రహించేశాడు. ఎలాగైతే ముక్కను తిరగేశారు. అది జాకీ బొమ్మ!

లక్కీగా పావలా వచ్చేసింది వెంకట్రావుకి. ఈదఫా అర్ధరూపాయి తీసి మూలకొద్దిగా మడతపడ్డ ముక్కమీద పెట్టేడు. ఆ ఆనమాలువల్ల వెంకట్రావుకి తెలుసు అది జాకీ అని. త్రిప్పి చూసేసరికి మళ్ళీ జాకీబొమ్మ! వెంకట్రావుకి ఇప్పుడో అర్ధరూపాయి వచ్చింది. హుషారు జాస్తి అయింది.

ఈ దఫా రెండురూపాయిల కాగితము తీశాడు. మారన్న ముక్కలు ఇటు అటు మార్చి బల్లమీద పెట్టగానే వెంకట్రావు ఆ ఆనమాలున్న ముక్కమీద పెట్టేశాడు. వెంకట్రావుకి తెలుసు యీ పందెం కూడా తనదేనని. వెంకట్రావుకు కంగా రెక్కువయింది.

"తిప్పండి! గబుక్కున తిప్పండీ" అన్నాడు వెంకట్రావు ఒక్కసారిగా. త్రిప్పారు. అది జాకీబొమ్మకాదు. 7 బంతి!

వెంకట్రావుకి ఏడు బంతి లక్షణము కొంచెం వంట బట్టింది. ఉక్రోషంతో మళ్లీ రెండురూపాయిల నోటు తీశాడు. ఈసారి ఆ ఆనమాలు లేనిదానిమీద పెట్టేడు, కొంచెం ఆలోచించి. ముక్క తిప్పారు. అది ఆరుబంతి! ఆనమాలుది జాకీబొమ్మ! శుభ్రంగా ఆ ఆనమాలున్నదానిమీదే పెట్టే తనకే వచ్చును!

ఈసారి వెంకట్రావు మళ్లీ రూపాయి తీశాడు. ఆనమాలు చూడకూడదని అనుకున్నాడు. మొట్టమొదట ముక్కలు చూపించి మార్చేటప్పుడు జాకీముక్కను వెంటాడుతూ దానిమీదే చివరికి పెట్టేడు. "నేనూ ఆడ్తానం"టూ ఆ ప్రక్కన కూర్చున్న కుర్రాడు ఒక పావలాతీసి వెంకట్రావు పెట్టినదానిమీదే పెట్టాడు. దీంతో మారన్న కోపంగా అన్నాడు: "మీ రిద్దరూ ఒకదానిమీదే పెట్టారు. నేను ఒప్పుకోను..." అని ముక్కలు తీసేశాడు వెంకట్రావు డబ్బుపోయి ఉన్నాడేమో కొంచెం కోపంగా ధూసుడుగా మారన్నమీదకు లేచాడు. అలా పెట్టకూడదని మారన్న; ముందు ఎందుకు చెప్పలేదని వెంకట్రావు గలాటాపడ్డారు. "గొప్పవాడివే బయల్దేరావు" అని వెంకట్రావు తన రూపాయి తీసుకొని మొఖం మాడ్చుకొని లేచిపోయాడు.

"......అనవసరంగా పోయినాయండి అయిన మూడుంబావలాను ఆఖర్న వాడికీ నాకూ దెబ్బలాటవచ్చిందండీ! నేను పెట్టిన దానిమీదే కుర్రాడు కూడా పెట్టే ఇద్దఱూ పెట్టకూడదని పెద్ద అల్లరి చేశాడండీ..."

కథంతా విని మూర్తిగారు ఒక చిరునవ్వు నవ్వి ఇలా అన్నారు:—

"నువ్వు నిజంగా చాల అదృష్టవంతుడవయ్యా. ఏదో మూడురూపాయిల పావలాతోనే లేచిపోయావు. ఈ పిచ్చిలోపడి పదులు, ఇరవైలు పోగొట్టుకునేవాళ్లున్నారు. .....ఆ ప్రక్కనున్న కుర్రాడు వాడి కొడుకో లేకపోతే వాడితాలూకు మనిషో. ఎవరైనా మనిషి వస్తే ఆకర్షించటానికి ఇద్దరూ గమ్మత్తుగా ఆడుతూ ఉంటారు. అది చూసి నీ మాదిరిగానే అనేకమంది వాళ్ళవల్లో పడుతూంటారు...నువ్వు దెబ్బలాట అన్నావే! ఆఖరిసైములో నువ్వు రైటుగానే పెట్టేవు. నీకు దక్కకుండా చెయ్యడానికి ఆ కుర్రాడు కూడా నువ్వు పెట్టినదాని మీదే పెట్టాడు. అప్పుడు 'మీ రిద్దరూ పెట్టేరు. నేను ఒప్పుకోను' అని నిన్ను డబాయించాడు. అంతే. ఇది మామూలే...

దీంతో అసలు రంగు తెలిసింది వెంకట్రావుకి. అతనికి రావిచెట్టుదగ్గఱకు వచ్చేటప్పటికి అప్రయత్నంగా గలాటా జ్ఞప్తికి వచ్చింది... ★



ఒక విద్యార్థి :-ఇవ్వాళ మేష్టారు పాఠం చెబుతూ చెబుతూ గుర్రుపెట్టి నిద్రపోయారు. నువ్వు విన్నావా ?

రెండోవాడు :-అవును, అప్పుడేగా నాకు మెలుకువ వచ్చింది ?